సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



కిలో టమాట రూ.18
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికాయి.



విద్యార్థులకు 'దీవెన'
పేద విద్యార్థుల చదువుల కోసం ప్రభుత్వం అందజేసే 'జగనన్న విద్యాదీవెన' నిధులను శుక్రవారం విడుదల చేయనున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం
33.6°/12.1°
జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటన

హిందూపురం టౌన్: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం హిందూపురం రానున్నట్లు హిందూపురం వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హిందూపురం మండలం, మధ్యాహ్నం 12 గంటలకు లేపాక్షి మండలాలకు చెందిన అబ్జర్వర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, ఎంపీటీసీలు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొనాలని సూచించారు.

ఎస్పీని కలిసిన జేసీ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

పుట్టపర్తి టౌన్: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన అభిషేక్ కుమార్ జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని కలిశారు. గురువారం ఎస్పీ చాంబర్‌కు వెళ్లిన జేసీ మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో 'ఆసే'



ఆసే కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి, ఆయన కుమారుడు, భక్తులు

పెనుకొండ: పెనుకొండ బాబయ్య దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు 'ఆసే' కార్యక్రమాన్ని దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా నేతృత్వంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గాలోని బాబయ్య స్వామి చేతి కర్రను పీఠాధిపతి కుమారుడు నజర్ హుస్సేని తదితరులు ప్రదర్శించారు. అనంతరం దర్గాలో బాబయ్య స్వామికి సంబంధించిన ఐదు పీర్లతో ఏడు ప్రదక్షిణలు నిర్వహించారు. భక్తుల సందర్శనార్థం పీర్లను కొలువు దీర్చారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు.


హైరిస్క్ గర్భిణులకు మెరుగైన సేవలు



అవగాహన కల్పిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ కృష్ణారెడ్డి

ప్రశాంతి నిలయం: గర్భం దాల్చినప్పటి నుంచి 9 నెలలు పూర్తయ్యే వరకు హైరిస్క్ గర్భిణులకు వైద్య సేవలు అందించేటప్పుడు వైద్యులు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి సూచించారు. హైరిస్క్ గర్భిణులకు వైద్య సేవలు అందించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ రక్తహీనత, హైపర్ టెన్షన్, డయాబెటిస్, మూర్ఛరోగము, కాన్పు తరువాత రక్తస్రావం వంటి సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో భాగంగా గ్రామాలకు వెళ్లే వైద్యులు గర్భిణులను పరిశీలించి సేవలు అందించాలని సూచించారు. ప్రతి గర్భిణికి నాలుగు హెల్త్ చెకప్‌లలో 2 , 4వ హెల్త్ చెకప్‌లను వైద్యులే చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కృష్ణయ్య, డీటీసీఓ తిప్పయ్య, డీబీసీపీఓ అనూరాధ, జిల్లాకు చెందిన వైద్యాధికారులు, గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

ప్రగతి బాట



- కొత్త జిల్లా.. రహదారులు భళా!
- శ్రీ సత్యసాయి జిల్లాలో 251 కిలోమీటర్ల ఎన్‌హెచ్ నిర్మాణాలు
- ఇప్పటికే 114 కిలోమీటర్ల పూర్తి
- రూ.3,700 కోట్లకు పైగా వ్యయం
- వలు జిల్లాలతో అనుసంధానం
- మెరుగవనున్న రవాణా సౌకర్యం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కొత్త జిల్లా సంకల్పం సాకారమవుతోంది. పాలనను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలిస్తోంది. ఇప్పటికే పరిశ్రమల ఖిల్లాగా శ్రీ సత్యసాయి జిల్లా పేరొందింది. రాష్ట్ర ప్రభుత్వ కృషితో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. రహదారులు అందుబాటులోకి వస్తే జిల్లా మరింత శోభ సంతరించుకోనుంది.

251 కిలోమీటర్ల మేర..

గడిచిన నాలుగున్నరేళ్లలో రమారమి ఎనిమిది జాతీయ రహదారి ప్రాజెక్టులు శ్రీ సత్యసాయి జిల్లాకు వచ్చాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జరుగుతున్న పనులు రెండేళ్లలో పూర్తి కానున్నాయి. రహదారుల నిర్మాణంతో శ్రీ సత్యసాయి జిల్లా రూపురేఖలే మారిపోనున్నాయి. జిల్లా విభజనకు ముందు ఇంత భారీ ఎత్తున ఎప్పుడూ రోడ్డు ప్రాజెక్టులు చేపట్టిన సందర్భాలు లేవు. ఒక్క శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోనే 251 కిలోమీటర్లకు పైగా పనులు జరుగుతున్నాయి. ఇవి కాకుండా రాష్ట్ర రోడ్లు భవనాల పరిధిలో, పంచాయతీ పరిధిలో రోడ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ప్రాజెక్టులకు రూ.3,739.58 కోట్లు వ్యయం చేస్తున్నారు. దీంతో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడిదారులు భారీగా ముందుకొచ్చే అవకాశం ఉంది. శ్రీ సత్యసాయి జిల్లా నుంచి బెంగుళూరు, హైదరాబాద్, విజయవాడ, కడప, కర్నూలు, చిత్తూరు ప్రాంతాలకు అనుసంధానం పెరగనుంది.

పరిశ్రమల వెల్లువ..

శ్రీసత్యసాయి జిల్లాలో నాలుగున్నరేళ్లలోనే 8,977 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు ఏర్పాటయ్యాయి. రూ.836 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మెరుగైన రవాణా సౌకర్యం, అనుకూల వాతావరణం, ప్రభుత్వ సహకారం ఉండడంతో ప్రాజెక్టులు తరలివచ్చాయి. జాతీయ రహదారి నిర్మాణాలు పూర్తయితే చిన్న పరిశ్రమలతో పాటు మరికొన్ని భారీ పరిశ్రమలూ వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే పాలసముద్రం వద్ద నెలకొల్పుతున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ నాసిన్ రాష్ట్రానికే తలమానికం కాబోతోంది.

జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణ పనులు ఇలా

ప్రాజెక్టు	కిలోమీటర్లు	వ్యయం	పనులు పూర్తి
కదిరి బైపాస్	12.578	రూ.220.66 కోట్లు	85.85 శాతం
హిందూపూర్-పరిగి	20.04	రూ.98.16 కోట్లు	85.50 శాతం
ముదిగుబ్బ బైపాస్	7.749	రూ.116.81 కోట్లు	80.10 శాతం
మడకశిర-సిర	42.376	రూ.207.79 కోట్లు	97.99 శాతం
బత్తలపల్లి-ముదిగుబ్బ	33.00	రూ.535.99 కోట్లు	50.72 శాతం
ముదిగుబ్బ-పుట్టపర్తి	32.00	రూ.401.72 కోట్లు	42.28 శాతం
బి.కొత్తపల్లి-గోరంట్ల	56.99	రూ.839.88 కోట్లు	08.95 శాతం
పుట్టపర్తి-కోడూరు	46.76	రూ.1318.57 కోట్లు	4.38 శాతం

త్వరలో పనులు పూర్తి

జిల్లాలో చాలా రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పనులు త్వరలోనే పూర్తి చేస్తాం. ప్రాజెక్టులకు భూ సేకరణ పూర్తి చేశాం. సమస్యలున్న చోట ఆర్బిట్రేషన్ (మధ్యవర్తిత్వం) ద్వారా పరిష్కరించాం. రోడ్డు పనులు పూర్తయితే రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుంది.

– అరుణ్ బాబు, కలెక్టర్

నైపుణ్యాలను వెలికి తీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

- కలెక్టర్ అరుణ్‌బాబు



పెనుకొండ: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పెనుకొండ: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కళాశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాలీబాల్ జట్టు సభ్యులను పరిచయం చేసుకున్నారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఒక వాలీబాల్ జట్టులో కలెక్టర్ అరుణ్‌బాబు, మరో జట్టులో సబ్‌కలెక్టర్ భరత్ ప్రాతినిధ్యం వహించారు. క్రీడాకారులను ఉత్తేజపరుస్తూ వారు కాసేపు వాలీబాల్ ఆడారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడల్లో బాగా రాణించాలని సూచించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. 47 రోజుల పాటు గ్రామ, సచివాలయ, మండల నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల ద్వారా గ్రామస్థాయి నుంచి ఆరోగ్యమైన జీవనశైలిని ప్రోత్సహించడం కోసం క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని జాతీయ, అంతర్జాతీయంగా క్రీడల్లో పోటీపడేలా తీర్చిదిద్దేందుకు 'ఆడుదాం ఆంధ్రా' ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్రీడాకారులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయభాస్కర్, ఎంపీడీఓ శివశంకరప్ప, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా కేసు నమోదు



అనంతపురం మెడికల్: అనంతపురం జిల్లాలో గురువారం ఒక కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 41 మందికి ఆర్‌టీపీసీఆర్ పరీక్ష నిర్వహించారు. రూరల్ పరిధిలోని కొడిమికి చెందిన 38 ఏళ్ల యువకుడికి పాజిటివ్‌గా నిర్ధారణైంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు విషయాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవికి తెలియజేయగా.. ఆమె ఆరోగ్య శాఖ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సదరు యువకుడి కుటుంబ సభ్యులకు నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు.

పటిష్ట నిఘా ఉంచాలి



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ధర్మవరం అర్బన్: జిల్లాలో ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్‌ల వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉంచాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గురువారం ధర్మవరం పట్టణంలోని గోడౌన్‌లో ఉన్న ఈవీఎంలను కలెక్టర్ అరుణ్‌బాబు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. గోడౌన్ లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్‌లను అక్కడి భద్రతా చర్యలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్‌రెడ్డి, తహసీల్దార్ యోగేశ్వరిదేవి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

పుట్టపర్తి టౌన్/ హిందూపురం అర్బన్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ముద్దాయి శ్రీనివాసులు (36)కి జీవిత ఖైదు పడింది. వివరాల్లోకి వెళితే... ఈ ఏడాది ఫిబ్రవరిలో చిలమత్తూరు మండలం నల్లరాయనిపల్లికి చెందిన ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన సీ.శ్రీనివాసులు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై చిలమత్తూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో అనంతపురం పోక్సో కోర్టు గురువారం తీర్పు వెల్లడించింది. ముద్దాయి శ్రీనివాసులుకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. బాధితురాలికి రూ.5.70 లక్షలు పరిహారం ఇవ్వాలని జడ్జి రాజ్యలక్ష్మి తీర్పునిచ్చారు. ముద్దాయికి శిక్ష పడేందుకు సహకరించిన హిందూపురం ప్రస్తుత డీఎస్పీ కంజాక్షన్, సీఐ వేణుగోపాల్, ఎస్ఐ గంగాధర్, కోర్టు పీసీ గురుస్వామిని ఎస్పీ మాధవరెడ్డి అభినందించారు.

6న జేఎన్‌టీయూ (ఏ) స్నాతకోత్సవం

- చాన్స్‌లర్ హోదాలో హాజరుకానున్న గవర్నర్ జస్టిస్ నజీర్
- బాలవీరా రెడ్డికి గౌరవ డాక్టరేట్ అందజేయనున్న చాన్స్‌లర్
- ప్రధాన వక్తగా సీనియర్ ఐఏఎస్ సత్యనారాయణ రాజు ఎంపిక



కే.బాల వీరారెడ్డి



వి.సత్యనారాయణ రాజు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) 13వ స్నాతకోత్సవం కొత్త ఏడాదిలో జరగనుంది. 2024 జనవరి 6న నిర్వహించాలని వర్సిటీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ముఖ్య అతిథిగా గవర్నర్ /చాన్స్‌లర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయం నుంచి అధికారిక సమాచారం వర్సిటీకి అందింది. స్నాతకోత్సవం సందర్భంగా గౌరవ డాక్టరేట్‌ను విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కే. బాలవీరారెడ్డికి ప్రదానం చేయనున్నారు. స్నాతకోత్సవ ఏర్పాట్లలో వర్సిటీ అధికారులు నిమగ్నమయ్యారు.

- ప్రొఫెసర్ కే. బాల వీరారెడ్డి జేఎన్‌టీయూ (ఏ) పూర్వ విద్యార్థి. 1958–1963 బ్యాచ్. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీ, సూరత్‌కల్ (కర్ణాటక)లో వివిధ హోదాల్లో పనిచేశారు. కర్ణాటక డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, బెళగావి, విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీ వీసీగా బాధ్యతలు నిర్వర్తించారు.
- స్నాతకోత్సవ ముఖ్య వక్తగా ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ వి. సత్యనారాయణ రాజును ఎంపిక చేశారు. ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్, మెంబర్, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ (ట్రాయ్) న్యూఢిల్లీ చైర్మన్, నావల్ రీసెర్చ్ బోర్డు, డీఆర్‌డీఓలో ఆయన విశేష సేవలు అందించారు. అయోధ్య రామ మందిరం, నూతన పార్లమెంట్ భవన నిర్మాణం వి. సత్యనారాయణ రాజు పర్యవేక్షణలోనే సాగడం గమనార్హం. స్నాతకోత్సవానికి బాల వీరా రెడ్డికి గౌరవ డాక్టరేట్ అందజేయడం, ప్రొఫెసర్ వి. సత్యనారాయణ రాజు ముఖ్య వక్తగా పాల్గొంటుడడం గర్వకారణమని వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన తెలిపారు.

కనీస మద్దతు ధరతో కందుల కొనుగోలు

- జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ఏపీ పౌరసరఫరాల సంస్థ ద్వారా కనీస మద్దతు ధరతో కందులు కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7 వేలతో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయాలన్నారు. సేకరించిన కందులను మర ఆడించి తిరిగి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు నాణ్యమైన కంది బేడలను అందజేయాలని సూచించారు. జిల్లాలో 27,111 హెక్టార్లలో 21,035 మంది రైతులు కంది పంట సాగు చేశారన్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ ద్వారా ఈ క్రాప్ నమోదు చేసినట్లు చెప్పారు. కందులు అమ్మదలిచిన రైతులు ఆర్‌బీకేలను సంప్రదించాలన్నారు. గోనె సంచులు, కూలీల ఖర్చు, రవాణా ఖర్చులను సైతం ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఎవరూ దళారులను నమ్మి మోసపోకూడదన్నారు.



మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న మహిళా పోలీసులు



బాస్కెట్‌బాల్ ఆడుతున్న పోలీసులు

హోరా హోరీగా..
పోలీస్ క్రీడలు

పుట్టపర్తి టౌన్: స్థానిక పరేడ్ మైదానంలో రెండోరోజు గురువారం పోలీస్ క్రీడలు హోరా హోరీగా జరిగాయి. ఎస్పీ ఆదేశాలతో అన్ని సబ్ డివిజన్ల పరిధిలో పనిచేస్తున్న పోలీసులు ఈ పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని చాటారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్, 100 మీటర్ల పరుగు పందెం తదితర పోటీలు నిర్వహించారు. అన్ని విభాగాల్లో సెమీఫైనల్స్ పోటీలు నిర్వహించారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మడకశిర రూరల్: మండలంలోని ఆమిదాలగొంది సమీపంలో ప్రధార రహదారి పక్కన 46 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ లోకేష్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మతిస్థిమితం లేని వాడా? భిక్షగాడా? అనేది నిర్ధారణ కావాల్సి ఉంది. ఆచూకీ తెలిసిన వారు 94901 12475, 94407 96820కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

పాత మిద్దె కూలి ఇద్దరి మృతి




ప్రమాదంలో మృతి చెందిన కూలీలు

తిరుపతి క్రైమ్: పాత భవనం కూలుస్తుండగా శిథిలాల కింద చిక్కుకుని ఇద్దరు కూలీలు మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి వెస్ట్ పోలీసులు తెలిపిన మేరకు... తిరుపతిలోని మంచాల వీధిలో నివాసం ఉంటున్న షబ్బీర్ అదే ప్రాంతంలో ఉన్న తన పాత ఇంటిని కూల్చేందుకు మోషన్ బాషాకు కాంట్రాక్ట్ ఇచ్చాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆరుగురు కూలీలు పనిలో నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా భవనం కుప్పకూలింది. శిథిలాల కింద చిక్కుకుని శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన నారాయణ(40), వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన నరసింహులు(50) తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఇదే ప్రమాదంలో ఓ మహిళతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను రుయా ఆస్పత్రికి తరలించారు. పాత భవనం కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా తడవడం వల్ల కూల్చే సమయంలో కుప్పకూలినట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అక్షయతో ఉపాధ్యాయులు

రొద్దం: మండలంలోని నారనాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బి.అక్షయ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు ఆ పాఠశాల హెచ్‌ఎం రంగప్ప, పీఈటీ మహేష్ గురువారం తెలిపారు. ఇటీవల గుంటూరు జిల్లా పెదకాకానిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన అక్షయను జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు సెలెక్టర్లు ఎంపిక చేశారన్నారు. దీంతో జనవరి 2 నుంచి 5వ తేదీ వరకూ చత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టు తరఫున ఆమె పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన అక్షయను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

విద్యార్థులకు 'దీవెన'

జిల్లాలో విద్యా దీవెన ఇలా..		
నియోజకవర్గం	విద్యార్థుల సంఖ్య	నిధులు
ధర్మవరం	6,171	రూ.4,46,71,200
హిందూపురం	3,607	రూ.2,31,07,030
కదిరి	4,906	రూ.3,26,19,392
మడకశిర	3,361	రూ.2,14,68,321
పెనుకొండ	4,738	రూ.3,15,56,566
పుట్టపర్తి	4,597	రూ.3,12,42,898
రాప్తాడు	2,111	రూ.1,54,07,185
మొత్తం	29,491	రూ.20,00,72,592



- నేడు జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల
- పక్కాగా నిధుల విడుదలపై తల్లిదండ్రుల హర్షం

పుట్టపర్తి: పేద విద్యార్థుల చదువుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలా భరోసా ఇస్తోంది. నాడు – నేడు, మధ్యాహ్న భోజన పథకం, విద్యా కానుక, విదేశీ విద్య, విద్యా దీవెన ఇలా అన్ని కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తోంది. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని బలంగా నమ్మిన సీఎం వైఎస్ జగన్ ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే 2022–23 విద్యా దీవెనకు సంబంధించిన నిధులను శుక్రవారం విడుదల చేయనున్నారు.

తల్లిదండ్రులపై భారం పడకుండా...

రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ విద్యను అందించాలన్న ఆశయంతో ముఖ్యంగా విద్యా దీవెన, విద్యా వసతి దీవెన పథకాలను అమల్లోకి తెచ్చి పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. గత నాలుగేళ్లుగా పక్కాగా ఈ పథకాలను అమలు చేస్తుండటంతో ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పథకాల ద్వారా జిల్లాలోని చాలా మంది విద్యార్థులు సంతోషంగా తమ చదువులను సాగిస్తున్నారు. వసతి దీవెన కింద ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ 20 వేలు, విద్యా దీవెన కింద కళాశాల ఫీజుల ఆధారంగా విద్యార్థిపై భారం పడకుండా ప్రభుత్వమే ఫీజును చెల్లిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2022–23 ఏడాదికి సంబంధించి జగనన్న విద్యా దీవెన ద్వారా అర్హులైన విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం విద్యా దీవెన నిధులను విడుదల చేయనున్నారు.

కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం

పుట్టపర్తి అర్బన్: పేద విద్యార్థుల చదువుల కోసం ప్రభుత్వం అందజేసే 'జగనన్న విద్యాదీవెన' నిధులను శుక్రవారం విడుదల చేయనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హులైన 27,302 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.20.07 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేయనుందన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వమే ఆదుకుంటోంది



నేను పుట్టపర్తి సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ చదువుతున్నాను. విద్యార్థుల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంచి పథకాలను అమలు చేస్తోంది. పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఈ పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నాకు ప్రతి ఏటా విద్యా దీవెన కింద డబ్బులు చెల్లిస్తున్నారు. ఇలాంటి పథకాల వలన నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థులు చాలా మంది చదువుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

– కోమల శర్మ, సీఎస్‌ఈ, ఆదోని, కర్నూలు జిల్లా

తల్లిదండ్రులపై భారం లేదు



విద్యా దీవెన, విద్యా వసతి దీవెన పథకాల వల్ల ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుంటున్నారు. ఈ పథకాల ద్వారా నా చదువుకు సంబంధించి ఏమాత్రం మా తల్లితండ్రులపై భారం పడలేదు. తల్లితండ్రులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నేను సంతోషంగా నా చదువును కొనసాగిస్తున్నాను.

– ఓం ప్రదీప్‌రెడ్డి, సీఎస్‌ఈ, పోతులనాగపల్లి, ధర్మవరం

జనవాక్కు

చేసిన మేలు మరవలేము



సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును జీవితంలో మర్చిపోలేను. నా భర్త అనారోగ్యంతో చనిపోయినప్పుడు బతుకు తెరువు కోసం నా ఇద్దరు కొడుకులూ బెంగళూరుకు వెళ్లారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన చేయూత పథకం ఏటా రూ.18,750 చొప్పున మూడు సార్లు నగదు నా బ్యాంక్ ఖాతాలోకి జమ అయింది. ఆసరా పథకం కింద ఏటా రూ.7 వేలు అందుతోంది. ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తున్నారు. ఇంతగా మేలు చేసిన వైఎస్ జగన్‌కే మా మద్దతు.

– విమలాక్షమ్మ, ఫణారం, గుడిబండ మండలం

రుణపడి ఉంటాం



పౌరోహిత్యంతో జీవనం సాగిస్తున్న మేము ఎలాంటి ఆదాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో సీఎం వైఎస్ జగన్ ఎంతో ఆదుకున్నారు. కాపు నేస్తం పథకం కింద ఏటా రూ.15 వేలు లబ్ధి చేకూరుతోంది. మా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. గత ప్రభుత్వాలు బ్రాహ్మణుల సంక్షేమానికి ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత బ్రాహ్మణులకు అన్ని విధాలుగా మంచి జరుగుతోంది. ఆయనకు మేమంతా ఎంతో రుణపడి ఉన్నాం.

– ఆర్.సువర్ణమ్మ, కునుకుంట్ల, తాడిమర్రి

మళ్లీ జగనే సీఎం



పేదలకు మంచి జరగాలంటే మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలి. దీవెన పథకాలతో నా కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. నాకూ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందుతోంది. దీంతో పెట్టుబడి పెట్టి పంటల సాగు చేస్తున్నా. మా ఊళ్లోనే విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారు. పేదలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కే మా మద్దతు.

– గంటా ధనుంజయ, రాగులపాడు, వజ్రకరూరు మండలం

సొంతింటి కల నెరవేరింది



దాదాపు 20 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే బతికాం. ఇంటిల్లిపాది కూలి పనులకెళితే తప్ప జీవనం జరగడం కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో సొంతిల్లు ఉంటే అద్దె డబ్బులైనా మిగులుతాయనుకున్నాం. గత ప్రభుత్వంలో మా గోడు ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎలాంటి సిఫారసు లేకుండానే వలంటీర్ వచ్చి ఇంటి పట్టా చేతికి ఇచ్చాడు. ఇల్లు కూడా మంజూరైంది. త్వరలో సొంతింట్లోకి చేరుకుంటున్నాం. అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ, సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత పథకాలతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి.

– కవిత, పాల్తూరు, విడపనకల్లు మండలం

మొబైల్ పేకాటరాయుళ్ల అరెస్ట్



పికప్ వాహనంలో పేకాట ఆడుతూ పట్టుబడిన జూదరులు

కూడేరు/అనంతపురం క్రైం: బొలెరో పికప్ వాహనంలో పేకాట ఆడుతూ పలువురు కూడేరు పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు... నార్పల, బుక్కరాయసముద్రం మండలాలకు చెందిన 16 మంది బొలెరో పికప్ వాహనాన్ని ఏర్పాటు చేసుకుని గురువారం ఉదయం పేకాట ఆడుకుంటూ ఉరవకొండ వైపుగా ప్రయాణమయ్యారు. అప్పటికే జల్లిపల్లి టోల్ గేట్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా మొబైల్ పేకాట వాహనం అక్కడకు చేరుకుంది. విషయాన్ని గుర్తించిన పోలీసులు వెంటనే బొలెరో పికప్ వాహనాన్ని చుట్టుముట్టి పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.1.44 లక్షల నగదు, 16 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారు కమ్మల అపహరణ

మడకశిర: మహిళ చెవిలోని బంగారు కమ్మలను అపహరించుకెళ్లిన ఘటన మడకశిరలో సంచలనం రేకెత్తించింది. బాధితురాలు తెలిపిన మేరకు.. మడకశిరలోని అక్కంపల్లికి చెందిన హనుమక్క ఇంటి వద్దకు గురువారం మధ్యాహ్నం ఇద్దరు యువకులు చేరుకుని తాము సచివాలయ సిబ్బందిగా పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధికి సంబంధించిన వివరాల కోసం వచ్చామని, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉందంటూ నమ్మించారు. ఫొటో కావాలని చెప్పడంతో ఆమె అందుకు సిద్ధమైంది. ఆ సమయంలో శరీరంపై బంగారు ఆభరణాలు ఉంటే ప్రభుత్వ పథకాలు వర్తించవని నమ్మబలికి చెవిలో ఉన్న రూ.15 వేలు విలువ చేసే బంగారు కమ్మలు తీసి పక్కన పెట్టాలని సూచించారు. దీంతో ఆమె వాటిని తీసి పక్కన పెట్టింది. ఆ సమయంలో ఓ యువకుడు సెల్‌ఫోన్‌లో ఫొటో తీస్తుండగా మరో యువకుడు కమ్మలను చేతిలో తీసుకుని ద్విచక్ర వాహనాన్ని స్టార్ట్ చేయగానే రెండో యువకుడు పరుగున వెళ్లి కూర్చొన్నాడు. హనుమక్క అప్రమత్తమయ్యే లోపు అక్కడి నుంచి ఉడాయించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది. కాగా, మడకశిర పరిధి/ లోని దాసరిబండలోనూ ఇదే తరహాలో చోరీకి విఫలయత్నం జరిగినట్లు సమాచారం.

వ్యక్తి అనుమానాస్పద మృతి



శ్రీనివాసరెడ్డి (ఫైల్)

రొళ్ల: మండలంలోని అలుపనపల్లి నివాసి శ్రీనివాసరెడ్డి (32) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లుగా తల్లి అనసూయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు... వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న అనసూయమ్మకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు శ్రీనివాసరెడ్డి ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా శ్రీనివాసరెడ్డి జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం ఆటో డ్రైవింగ్‌కు వెళ్లిన శ్రీనివాసరెడ్డి తిరిగి రాలేదు. రాత్రి 11 గంటలకు కాకిగొల్లహట్టి వద్ద ఆటో బోల్తాపడి శ్రీనివాసరెడ్డి మృతి చెందాడని అదే గ్రామానికి చెందిన రంగారెడ్డి ద్వారా సమాచారం అందుకున్న అనసూయమ్మ అక్కడకు చేరుకుని పరిశీలించింది. అయితే తమ ఆటోలో కాకుండా రత్నగిరికి చెందిన బాబు ఆటోలో వెళ్లిన తన కుమారుడి మృతిపై ఆమె అనుమానాలు వ్యక్తం చేసింది. ఆటోలో మరో ఐదుగురు ఉన్నారని, వీరంతా కర్ణాటకలోని రంటవాళ వైపు ప్రయాణమైనట్లుగా పేర్కొంది. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

వికలాంగుల చట్టం పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న దివ్యాంగుల పోరాట హక్కుల సమితి నాయకులు

పుట్టపర్తి టౌన్: వికలాంగుల చట్టం–2016ను పక్కాగా అమలు చేయాలని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సేవా సమితి ఉద్యోగుల విభాగం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీ కోరారు. పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ... సమాజంలో వికలాంగులు ఉన్నతంగా స్వేచ్ఛగా బతకడానికి రక్షణ కల్పించాలన్నారు. ఉద్యోగ అవకాశాల్లో దివ్యాంగులకు న్యాయం చేయాలన్నారు. జిల్లాలో 35 వేల మందికి పైగా దివ్యాంగులు ఉన్నారని వారి సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు వివరించారు. కార్యక్రమంలో సమితి ఉద్యోగుల విభాగం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు ధనుంజయ, రామిరెడ్డి, నరసింహారెడ్డి, ఈశ్వరయ్య, నాయుడు, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



దినేష్ (ఫైల్)

నల్లచెరువు: కడుపు నొప్పి తాళలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... నల్లచెరువు మండలం ఓరువాయి పంచాయతీ గురికానివారిపల్లికి చెందిన రైతు మునిరెడ్డి కుమారుడు దినేష్ (17) కదిరిలోని బసిరెడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా కళాశాలకు వెళ్లకుండా ఇంటి పట్టునే ఉండేవాడు. గమనించిన తల్లిదండ్రులు ప్రశ్నించినా సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండేవాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ లింగన్న అక్కడకు చేరుకుని పరిశీలించారు. కడుపు నొప్పి తాళలేక తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లుగా తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పండుగలా సంక్షేమ పథకాలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

- వైఎస్సార్ పింఛన్ కానుక, ఆసరా, వైఎస్సార్ చేయూత అమలుకు ప్రభుత్వం చర్యలు
- అర్హులందరికీ అందించాలన్న కలెక్టర్ అరుణ్‌బాబు
- ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని ఆదేశం

పుట్టపర్తి అర్బన్: పక్కాగా సంక్షేమ పథకాల అమలుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే జనవరి 1 నుంచి సామాజిక పింఛన్లను రూ.3 వేలు అందజేయడం, 23 నుంచి 31వ తేదీ వరకూ వైఎస్సార్ ఆసరా, ఫిబ్రవరి 5 నుంచి 14వ తేదీ వరకూ వైఎస్సార్ చేయూత పథకాలను అమలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం విజయవాడలోని తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక , డీఆర్‌డీఏపీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లతో వీసీ నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న కార్యక్రమాలకు సంబంధించిన కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రచారం చేయాలన్నారు. గ్రామ సచివాలయాల నుంచి జిల్లా స్థాయి వరకు పండుగ వాతావరణంలో సంక్షేమ పథకాల పంపిణీ చేసేందుకు అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలకు సంబంధించి షెడ్యూల్ రూపొందించుకొని ముందుకు వెళ్లాలన్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి 8వ తేదీ వరకు వైఎస్సార్ పింఛన్ కానుక, జనవరి 23వ తేదీన వైఎస్సార్ ఆసరా కార్యక్రమం, ఫిబ్రవరి 5న వైఎస్సార్ చేయూత పథకం ప్రారంభించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ చేయూత కింద 5 నుంచి 14వ తేదీ వరకు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సంబంధిత అధికారులందరూ ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసుకుని విజయవంతం చేయాలన్నారు. ఫిబ్రవరి 16న వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద జిల్లాకు 25 వేల కార్డులు వచ్చేయని వాటి పంపిణీని వేగవంతం చేయాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి: ఒంటరి జీవితం తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు....

చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెల గ్రామానికి చెందిన హరినారాయణ, నాగరత్నమ్మ దంపతులకు ప్రవీణ్ (24) ఏకైక కుమారుడు. పదేళ్ల క్రితం తల్లిదండ్రులిద్దరూ మరణించడంతో అప్పటి నుంచి ప్రవీణ్ ఒంటరిగానే జీవిస్తున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ప్రవీణ్ పదిరోజుల క్రితం ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. గురువారం ఇంటి నుంచి దుర్వాసన వెలువడుతుండడంతో అనుమానం వచ్చిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తలుపులు బద్దలుగొట్టి లోపలకెళ్లిన వారికి పూర్తిగా కుళ్లిన స్థితిలో ప్రవీణ్ మృతదేహం లభ్యమైంది. క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

ధర్మవరం అర్బన్: స్థానిక రేగాటిపల్లి గేటు సమీపంలో రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

యువకుడి దుర్మరణం

కనగానపల్లి: జేసీబీని ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.... కనగానపల్లి మండలం యలకుంట్లకు చెందిన శివకుమార్ (28) బుధవారం రాత్రి ధర్మవరంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో కనగానపల్లి సమీపంలోని చింతవనం వద్ద రోడ్డు పక్కనే ఆగి ఉన్న జేసీబీని గుర్తించకుండా వేగంగా వెళ్లి ఢీకొని అదుపు తప్పి రోడ్డు మధ్యలోకి రాగానే వెనుకనే వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన శివకుమార్ తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. శివకుమార్‌కు భార్య హారిక, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై గురువారం ఉదయం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

థ్యాంక్యూ సీఎం సర్..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వలంటీర్లు

గాండ్లపెంట: గౌరవ వేతనం రూ.5 వేల నుంచి 5,750 పెంచడంతో సామాలగొంది గ్రామ వలంటీర్లు గురువారం ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్ మేకల శివప్రసాద్ మాట్లాడుతూ.. సమాజంలో గౌరవంతో పాటు వేతనాలు కూడా సీఎం పెంచారన్నారు. ఉగాది పర్వదినాన సేవా మిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో సన్మానించడం హర్షణీయమన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అవుతారన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు శివప్రసాద్, రమణప్ప, మారుతి, ఆర్బీకే మండల అధ్యక్షుడు శంకర్ నాయుడు, క్షేత్ర సహాయకుడు మల్లికార్జున నాయుడు, గృహసారథి శ్రీనివాసులు, శివప్ప, ఆదినారాయణ, సురేంద్ర, నాగముని పాల్గొన్నారు.

చేస్తున్న పనిపై అవగాహన కలిగి ఉండాలి

గుంతకల్లు: చేస్తున్న పనిపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని ఉద్యోగులకు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ సూచించారు. ఉద్యోగ విధి విధానాలు, ప్రమోషన్లు, డీఏలు, పనిష్‌మెంట్లు తదితర అంశాలపై గుంతకల్లులోని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో గురువారం ట్రేడ్ యూనియన్ ఎడ్యుకేషన్ తరగతులను నిర్వహించారు. డీఆర్‌ఎంతో పాటు సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ... ఉద్యోగులకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ఒరియంటేషన్ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏటా ఈ తరహా ఒరియంటేషన్ క్లాసులు నిర్వహించాలంటూ యూనియన్ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో మజ్దూరు యూనియన్ గుంతకల్లు డివిజన్ నాయకులు ఎస్.విజయ్‌కుమార్, కేఎండీ గౌస్, శ్రీనివాసశర్మ, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఆముదం సాగు చేపట్టండి

- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మంజునాథ్

ఉరవకొండ: వేరుశనగకు ప్రత్యామ్నాయ పంటగా ఆముదం సాగు చేపడితే లాభదాయకంగా ఉంటుందని హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ రిసెర్చ్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మంజునాథ్ అన్నారు. నూనె గింజల పంటల సాగుపై జిల్లా పరిధిలోని ఎఫ్‌ఈఓ, ఎస్‌టీసీలకు రాయలసీమ అగ్రి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం ఉరవకొండ వ్యవసాయ మార్కెట్‌యార్డులో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ.. ఆముదంలోని ఐసీహెచ్ 5 రకం విత్తనం పండించేందుకు జిల్లాలో అనుకూల వాతావరణం ఉందన్నారు. ఆముదం సాగుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌ఈసీ డైరెక్టర్ శ్రీధర్, భీమ్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.